Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:8(1), August: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# సాంస్కృతిక వస్తువుగా సన్నికల్లు

**డా. ఎం. రామలక్ష్మి,** తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్.
బి.జె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ.ప్ర), నారాయణగూడ, హైదరాబాద్, తెలంగాణ.
చరవాణి : 98480 47832

**పరిచయం**

ఈ భూమి రకరకాల శిలలసముదాయంతో కూడినది. మరెన్నో అద్భుత ఖనిజాలను నిక్షిప్తంచేసుకుంది. ఇలాంటి ఈ భూమిమీద ప్రాచీన మానవుని ఉనికి కొన్ని వేల సంవత్సరాల నుండి కనిపిస్తుంది. దానికి 'రాక్షసగుళ్ళు' వంటి ఆధారాలున్నాయి. వీటిలో దొరికిన వస్తువులు పాతరాతియుగం, కొత్తరాతి యుగాలకు చెందినవి.

ఆదిమానవుడు తన మనుగడకు వాడిన మొదటి ఖనిజం రాయి. ఇది అలోహము. వేట ప్రధాన జీవనాధారం, గుంపులుగా మనుష్యులు జీవించేవారు. జనాభా తక్కువ, మరణాల రేటు ఎక్కువ. భాష లేదు. అస్పష్టమైన ధ్వనులు చేసేవారు. జంతు దశనుంచి విడివడని కాలంలో ప్రకృతితో, క్రూరమృగాలతో, శీతోష్ణస్థితులతో పోరాటం ప్రధాన సమస్య. కాలంగడిచి రాళ్ళతో ఆయుధాలు, ఆహార సేకరణకు, రక్షణకు, వేటుకు విల్లంబులు చేయడం నేర్చాడు మానవుడు. 'రాయి' ద్వారా నిప్పునిచేయడం నేర్చా . నిప్పుకు 'చెకుముకి' రాయి (flint) ని ఉపయోగించాడు. రకరకాల రాళ్ళతో నీటి ఒరిపిడికి ఏర్పడిన నెర్రెలను ఆధారంగా చేసికొని గుహలను తొలిచి అందులో నివసించాడు.

శిలలతో గృహనిర్మాణం చేయ నేర్చాడు. ఈ విధంగా శిలాయుగ మానవుని నుంచీ క్రమేపీ కొత్తరాతి యుగము వరకు ఆపై నాగరక దిశగా మానవుని అభివృద్ధి సాగింది. పశుపోషణ, వ్యవసాయం, ధాన్యం నిల్వ చేయడం నేర్చినాడు. సంచార జీవనం వదిలి గృహాలను నిర్మించడం రాతితో పాత్రలు, చాలా ఉపయోగ వస్తువులు, మట్టితో కుండలు చేయడం, లోహాలతో ఆభరణాలు, ఆయుధాలు చేయడం నేర్చాడు. ఈ కాలంలోనే పితృదేవతారాధన మొదలైంది. మత విశ్వాసములు ఈ కాలంలోనే ప్రారంభమైనవి. మతంలోని ప్రాథమిక రూపాలలో 'వస్తుపూజ' ఒకటి. భౌతిక వస్తువుల్లో ఏదోశక్తి దాగి ఉందనే ఊహ ప్రకృతిలోని వస్తువుల పూజకు దారి తీసింది. ఒక రకంగా ఇది మానవాతీత శక్తిలో ఉండే నమ్మకం. మానవుడు ప్రకృతి నుండి ఎన్నో వస్తువులు తయారుచేసుకుంటూ సాంస్కృతిక భావజాలాన్ని ప్రక్షిప్తం చేసికున్నాడు. సాంస్కృతిక వారసత్వంగా వారుపయోగించిన వస్తుసామాగ్రిని, వారి భావజాలాన్ని ఇప్పటికీ మనం ఆచరిస్తున్నాం.

ప్రతి మానవుడు జీవించడానికి, రక్షణకు, పురోభివృద్ధికి ఇతరుల మీద ఆధార పడవలసిందే. ఈ ఆధారాన్ని బట్టే సంస్కృతి, సాంఘిక వ్యవస్థాపనము అనేవి కలుగుతున్నాయి. మానవుని ప్రకృతిసిద్ధమైన అవసరాలు ఆకలి, దప్పిక, కోరిక మొదలైనవి తీర్చుకోవడంలో తన చుట్టూ ఉన్న సహజ పరిసరాలను వినియోగించుకుంటాడు. మానవునికి, పరిసరానికి మధ్య ఉండే మానవోపకరణాలు, ప్రకృతి, ఇతరవ్యక్తులు లేకపోతే జీవించడం ఎట్లా దుర్భరమో అట్లాగే ఇతరవ్యక్తుల ప్రవర్తనను తగిన రీతులలో నడిపించు సంస్కృతి, సాంఘిక వ్యవస్థ లేకపోతే మనుగడే లేదు.

తెగలుగా, గణాలుగా జీవించడం నేర్చుకున్న మానవుడు కుటుంబ వ్యవస్థను ఏర్పరుచుకొని జీవించడంతో వివాహ వ్యవస్థకు ప్రాధాన్యత హెచ్చింది. సమిష్టి జీవవంతో 'జనపదాలు' ఏర్పడ్డాయి. అతి ప్రాథమిక దశలో ఈ తెగలలో ఏర్పడే భావాలు, భ్రమలు, భయాలు ఇవన్నీ కలిసి సామాజిక చైతన్యం అవుతుంది.మౌఖికజానపద విజ్ఞానానికి – వస్తు సంస్కృతికి నడుమ వారధిలాగా సాంఘికాచారములున్నాయి. వీటిలో పుట్టుక, పెళ్ళి, మరణం. నమ్మకాలు, మతం దేవుళ్ళు, నోములు, వ్రతాలు, జాతరలు పండుగలు, ఆటలు, వినోదాలు, వైద్యము, కర్మ కాండలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటిలో ప్రకృతిలోని వస్తూపయోగం ఉంటూనే ఉంటుంది. ఇది ఔపయోగిక వస్తువుగా, కళాత్మక వస్తువుగా, సాంస్కృతిక వస్తువుగా ఉపయోగపడుతుంది. ఈ వస్తువులే మానవుని సాంస్కృతికాచారాలలో అనేక సందర్భాలలో వినియోగించడం జరుగుతుంది. ఈ వ్యాసంలో నేను చెప్పదలచుకున్నది 'రాయి' ఏవిధంగా ఔపయోగికంగా వాడారో అది సాంస్కృతిక వస్తువుగా ఏ సందర్భాలలో ఉపయోగపడుతుందనేది.

**'రాయి' – 'శిల'**– అనే పదమునకు అమరకోశంలో 'శాల్యతే శ్లాఘ్యత ఇతి శిలా' అంటే 'కొనియాడబడునది' అని అర్థం. మరొక అర్థం ద్వార స్థంభము క్రింద నడ్డముగా యున్న తొక్కుడుపలక. దీనిని బట్టి ఇది ఇంటి గడపగా మొదట్లో వాడారని తెలుస్తుంది.

**పాషాణం** – వస్తువులను చూర్ణం చేయునది భూమిని గప్పునది. ఎండ చేక్రాగి జలమునుగ్రహించునది, వస్తువులను ఖండించునది, హింసించునది అని రాయికి అర్థములు. (అమరకోశం)

**రాతియిల్లు** – దీనిలో నివసించుట వలన చలి, ఎండ, వీని బాధలు నివారించును. మదో ద్రేకమును కలిగించును. కఫమును అణచును, పైత్యమును జేయును, నిశ్చలమగు బుద్ధినిచ్చును, జఠరదీప్తినిచు , వాత రోగమును శాంతింపజేయును గాని సదా నివాస యోగ్యముగాదు. (వస్తుగుణ దీపిక).

ఈ అర్థములు అనుభవమునుండి రాసినవి అయి ఉంటాయి. ఉపయోగ వస్తువుగా మొదట ఆయుధములుగా వాడిగా చేసిన చిన్న రాతి ముక్కను కర్రకుగాని ఎముకకు గాని గ్రుచ్చి శత్రువు మీదకు విసిరేవాడట.

2. ఇళ్ళను నిర్మించుకొనుట, సమాధులను (రాక్షసగుళ్ళు) నిర్మించుట చేశాడు.
3. అరుగులుగా, మంచాలు , కూర్చునే ఆసనాలుగా ఉపయోగించాడు. (బౌద్ధుల గుంటుపల్లి గుహలు ఉదాహరణం)
4. ఱోలు – పెద్దదిగా, మధ్యస్తమైందిగా, చిన్నదిగా ఉంటాయి. దంచడానికి రోకలి, రుబ్బడానికి పొత్రం (పత్తం) ఉంటాయి. వడ్ల దంపురోలు ఇది చాలా పెద్దది.
5. విసుర్రాయి లేదా తిరగలి ధాన్యమును పిండి చేసేవారు.
6. ఖల్వము – మందులు దంచుటకు ఉపయోగిస్తారు.
7. సానరాయి – గంధము తీయుటకు, మూలికలు అరగదీయుటకు పనిముట్లను వాడిగా నూఱుటకు ఉపయోగిస్తారు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:8(1), August: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

8. వంట పాత్రలుగా ఉపయోగిస్తారు – రాచిప్పలు ఇవి రకరకాల పరిమాణములలో ఉంటాయి. పెద్దవి చారుకాచుటకు, చిన్నవి రోటి పచ్చళ్ళు నిలువ చేయుటకు ఉపయోగిస్తారు.

9. వడ్ల దంపురోలు → దీనిలో ఒకదుక్కిదున్నేంత వర్షపు నీరు నిలుస్తుందట. దీనిని బట్టి వ్యవసాయానికి పనికి వచ్చే విజ్ఞానాన్ని తరువాతి తరానికి అందించేవారని తెలుస్తుంది.

10. రాతితొట్లు – పశువులు నీళ్ళు త్రాగుటకై ఉపయోగిస్తారు.

11. సన్నికల్లు → ఇది పచ్చళ్ళు, ఇతరాలు నూఱుటకు ఉపయోగిస్తారు. దీనికి శబ్దరత్నాకరంలో 'నూలురాయి' అని అర్థం ఇచ్చారు.

ఇది ఔపయోగిక వస్తువుగా నిత్యం ఉపయోగపడే ఒక చిన్న బల్ల పరుపుగా ఉండే రాయి. దీనికి అడ్డంగా గుండ్రంగా తయారుచేసిన రాతి పాత్రం జతగా ఉంటుంది. ఏది నూరాలన్నా ఇది అవసరం. ఈ సన్నికల్ల ప్రతి ఇంటిలో ఉండే నిత్యం ఉపయోగపడే రాతి పనిముట్టు. అంతేకాకుండా దేవాలయ నిర్మాణాలు, దేవతావిగ్రహాలు, కళాత్మక శిల్పాలు ఇవేకాకుండా విలువైన రాళ్ళు గుర్తించి ఆభరణాలతో ఉపయోగించారు

పొలిమేరరాయి – గ్రామానికి నాలుగుదిక్కులా పాతుతారు.

జానపదులు ఎక్కువగా రాతిని గ్రామదేవతగా ప్రతిష్ఠించుకుంటూరు. చిన్న చిన్న రాతి పలకలే చిన్న గుడిగా చేసి రాతి ముక్కనే దేవతగా అందులో ప్రతిష్ఠించుకుంటారు. ఇవి గ్రామ పొలిమేరల్లో ఉంటాయి. ఇక్కడ సాంస్కృతిక వస్తువుగా ఈ రాయి మారింది. ఎక్కువగా స్త్రీ దేవతల విగ్రహాలే ఇలా కనిపిస్తాయి.

గ్రామం నడిబొడ్డులో రాయిని పాతి బొడ్రాయి అని పూజిస్తారు. గ్రామాల్లో బొడ్రాయి నెత్తడం ఒక సామూహిక ఉత్సవంగా జరుపుకుంటారు. ఊరిని చల్లగా ఈ గ్రామ దేవత కాపాడుతుందని బోనాలను సమర్పించడం, బలులను ఇవ్వడం జరుగుతుంది. ఇలా రాయి సాంస్కృతిక వస్తువుగా ఉపయోగింపబడినది. అయితే ఉపయోగ వస్తువులైన ఱోలు, తిరగలి, సన్నికల్లు వివాహ సందర్భాల్లో సాంస్కృతిక వస్తువులుగా కూడ మనం ఉపయోగించుకోవడం జరుగుతుంది.

**ఱోలు** – ఔపయోగిక వస్తువైనా వివాహ సందర్భంలో, క్రొత్త పంటను ఉపయోగించుకునేముందు సాంస్కృతిక వస్తువుగా మారుతుంది. ముత్తైదువలు కలిసి ఱోటి ని అలంకరించి అందులో క్రొత్తగా పండిన వడ్లను దంచి నైవేద్యం వండి 'కూరాడు' దగ్గర నివేదన చేసి వాడుకుంటారు.

**విసుర్రాయి లేదా తిరగలి :** ఇది కూడా పెండ్లి సమయంలోనే సాంస్కృతిక వస్తువుగా మారుతుంది. ఱోటిలో పసుపును శుభ సూచకంగా దంచితే, ముత్తైదువలు కలిసిపాటలు పాడుతూ పసుపును విసురుతారు. పెండ్లికూతురుతో ధాన్యాన్ని పిండిగా విసిరే సంప్రదాయం ఉంది.

వివాహ సమయంలో 'సన్నికల్లు' మాత్రం అధికమైన ప్రాధాన్యత సంతరించుకుంది. వివాహం మానవ జీవితంలో మహత్తరమైన, మధురమైన, అనిర్వచనీయమైన అనుభూతిని మిగిల్చే ఘట్టము. మానవుడు పుడుతూనే సంస్కృతిని వెంటబెట్టుకునిరాడు. తాను పుట్టి పెరుగుతున్నపుడు క్రమేణ దానిని గ్రహిస్తాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:8(1), August: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

సాంఘిక సంపర్కాల వల్ల సంస్కృతిని ఏర్పరుచుకుంటాడు. కుటుంబ వ్యవస్థ, సాంప్రదాయిక పద్ధతులు సాంఘిక గతి శీలతకు గుర్తులు. మతం ఇక్కడ ప్రాధాన్యత వహిస్తున్నది.

సనాతన హిందూ వివాద పద్ధతిలో చాలా రకాల ఆచారాలున్నాయి. ఒకేమాట, ఒకే భావనతో భార్యాభర్తల సంపూర్ణ ఏకత్వ ప్రయాణంగా క్రొత్త జీవితం ప్రారంభమవుతుంది. ఈ వైవాహిక పద్ధతులు ప్రాంతాల వారీగా, కులాలవారీగా మతముల వారీ భిన్నమైనవిగా ఉంటాయి. హిందూ వివాహాల్లో పెద్దలు నిర్ణయించిన పెళ్ళిళ్ళు ఎక్కువగా జరిగేవి. పిన్న వయస్సులో జరిగేవి. ఈ సంప్రదాయంలో వరపూజ, కన్యాదానం, పాణిగ్రహణం, వధూవరులను కూర్చోబెట్టి జీలకర్ర బెల్లం పెట్టించడం, మాంగల్య ధారణ, సప్తపది, తలంబ్రాలు పోసుకోవడం, సన్నికల్లు త్రొక్కించడం, నాకబలి, బువ్వంబంతి మొదలగు ఆచారాలు ఉన్నాయి. సన్నికల్లుపై కాలు త్రొక్కించడం వైదిక సంస్కృతిలోని 'శిలారోహణం' శిల మీద ఒకరికాలు మరొకరు వధూవరులు త్రొక్కడం అనే ఆచారం నుండి వచ్చి ఉంటుంది. దీనికి వైదిక సంస్కృతిలో మంత్రాలు కూడా ఉన్నాయి.

"దక్షిణేన పదాశ్మాన మాస్థాపతి'' వధువు చేత ఆమె కుడికాలితో సన్ని కంటి పైన

**''అతిష్టే మమశ్మాన మశ్మేవత్వగ్గ్ స్థిరాభవ**

**అభితిష్ఠ పృతన్య తస్స హస్వ పృతనాయతః"** అనుచూ రాతిని తొక్కించవలెను. (ఓ వధూ నీవీ రాతిని తొక్కుము. ఈ రాత వలెనే నీవు స్థిరమైన దానివి కమ్ము, చెడ్డువారిని తరిమివేయుము).
అప్పుడు వధువు

**"ఇయం నార్యు పబ్రూతే కుల్పాన్యావ పంతి కా**
**దీర్ఘాయురస్తు మేపతీర్జీవాతు శరదశ్శతం"**

''నాపతి దీర్ఘాయువై నూరు సంవత్సరములు జీవించుగా'' యని హోమాగ్నికి ప్రదక్షిణము చేసి సన్నికల్లు తొక్కవలెను. అగ్నికి ప్రదక్షిణ చేస్తూ ''నీవే దంపతులను సమాన మనస్సు కలవానిగా చేతువు'' అని మూడు సార్లు తిరగవలెను. 'పితృకులము నుండి విడిపించి పతిగృహమునందు సుబద్ధు రాలై విడువకుండునట్లుగాక' యని సన్నికల్లుని వధువు కుడి పాదము చేత వరుడు తాకించుటు సంప్రదాయము. (అంతర్జాలంలోని హైందవ వివాహ పద్ధతి)

వివాహానికి సంబంధించిన అవైదిక దాక్షిణ్యాతి ఆచారాలను సోమేశ్వర దేవుడనే పశ్చిమ చాళుక్యరాజు (క్రీ.శ. 1130) 'అభిలషితార్థ చింతామణి' అనే సంస్కృత గ్రంథంలో వివరించాడు. 'వివాహ మంటపాన్ని తోరణాలు, పూలతో అలంకరించి వివాహవేదికపై బియ్యం పోయడము మొదలుకొని వైదికాచారంలోని పద్ధతులు ఒక్క 'శిలారోహణం' తప్ప మాజీరికాయుక్త తండులములు చల్లుకోవాలని ఉంది. ***(ఆంధ్రుల జానపద విజ్ఞానం. ఆర్వీయస్. సుందరం, పుట.246)***

పై విషయాన్ని గమనిస్తే సన్నికల్లు త్రొక్కించే ఆచారం 11వ శతాబ్దానికి పూర్వం జానపదుల్లో లేదేమో! అనిపిస్తుంది. నన్నయ భట్టు ఆంధ్రీకరించిన ఆంధ్రమహాభారతంలోని ద్రౌపదీ స్వయంవరము ఘట్టములో

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:8(1), August: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

కూడా ఈ ఆచారము వర్ణింపబడలేదు. దీనిని బట్టి తరువాత కాలములో శిలారోహణ వైదికాచారము వచ్చియుండవచ్చునని ఊహించవచ్చు.

పు అడుగు వెడల్పుగా, బల్లపరుపుగా ఉండే ఒకరా....... దీనికి జతగా పొన్ను లేని మద్దెల ఆకారంతో ఉండే రాయి పొత్రంగా వాడతారు. ఏమి నూరాలన్నా సన్నికల్లు మీద ఈ పోత్రంతో నూఱుతారు. ఇది ప్రతి ఇంటిలో ప్రతిదినము వాడు వస్తువు. అయితే వివాహతంతులో మాత్రం 'సన్నికల్లు' కూడా ముఖ్యమైన భూమిక వహిస్తుంది. మంగళసూత్రం తలంబ్రాలుతో పాటు సన్నికల్లుని వధువు చేత వరుడు త్రొక్కడం అనే సంప్రదాయాన్ని పాటిస్తారు. ఔపయోగిక వస్తువు ఈ సమయంలో అచ్చంగా సాంస్కృతిక వస్తువయి పోతుంది.

సన్నికల్లుకు నూఱు రాయి అని అర్ధము. ***(సూర్యరాయాంధ్రనిఘంటువు)***

సన్నెకల్లు – నూఱెడురాయి – పట్టము ***(శబ్దరత్నాకరము, పుట. 107)***

సన్నె– చిరుబంతిపసుపు – చిఱుత + బంతిపసుపు.

చిఱుబంతి పసుపు ముద్ద సన్నెపై నిడుభంగిన్ ***(జైమిని భారతం అశ్వమేధ పర్వం 2వ ఆశ్వాసం) (శబ్దరత్నాకరం, పుట. 375)***

శ్రీనాథుని కావ్యాలలో చరణంబు త్రొక్కు ఆచారము, సన్నికల్లు ప్రస్తావన ఉంది. శృంగార నైషధంలోని నలదౌత్యము ఘట్టములోని "అమర పతిన్వరించెదొ హవ్యవహుచరణంబు ద్రొక్కెదొ శమనుని జెట్టు వట్టెదొ సాగరవల్లభుపెండ్లియాడెదో'' అని నలుడు దమయంతిని దిక్పాలకులలో ఒకరిని వరించమని అడుగు సందర్భంలో చరణంబు ద్రొక్కు ప్రస్తావన కనిపిస్తుంది ***(శృంగార నైషధం – నలదౌత్యం – 77వ పద్యం)*** పైన వర్ణించిన వరించుట, చరణంబు ద్రొక్కుట, పాణిగ్రహణం పెండ్లియాడుట అని వేరువేరు పద్ధతులు కలవేమో అయితే రాను రాను పై వన్నీ పెద్దలు నిర్ణయించి చేసే వివాహంలో ఆచరించుట జరుగుటను బట్టి వివాహ బంధం చాలా దృఢంగా ఉండాలనే అభిప్రాయం వారితో ఉండేదని తెలుస్తుంది. స్వయంవర ఘట్టాలు, పాణిగ్రహణం నన్నయ భారతంతోని

**''భూపాగ్రణి నాదు దక్షిణ కరాగ్రము వట్టి కొని**
**మున్ను పాణిగ్రహణంబు చేసితి"** ***(ఆదిపర్వం – తృతీయ– 160వ పద్యం)*** అని దేవయాని యయాతితో అంటూ వివాహం ముందే జరిగిందని అంటుంది.

శ్రీనాథుని కాశీఖండములో ''సనెకల్దాచిన పెండ్లి మానునొకొ'' ***(కాశీ. 5-31)*** అప్రధానమైన విషయములకై ప్రధాన విషయములు ఆగవని భావము. ఇది వైదిక కర్మకాదని వ్యాఖ్యానంలో ఉన్నది. అల్లసాని పెద్దన మనుచరిత్రలో ఇందీ వరాక్షుని కథలో — ''గుండ్రా దాచిన పెండ్లి యేమిటికిఁ జిక్కుం గష్ట ముష్టింపచా'' (మనుచరిత్ర, ఇందీవరాక్షుని కథ)

పై రెండు ఉదాహరణలలో కాలుద్రొక్కించే ఆచారమునకు ప్రాధాన్యత లేదని వ్యాఖ్యానింపబడినా సన్నికల్లు అందరి ఇళ్ళల్లో ఉండే సాధారణ వస్తువు. దానిని ఎవరో కడుపు మంటతో దాచి పెడితే మాత్రం పెండ్లి ఆగదు. ఇంకోరాయిని తెచ్చి ఆ తంతు జరిపిస్తారు. తంతు మాత్రం ఆగదు. అంతేకాని ప్రాధాన్యం లేదని కాదు. గిరిక తన కాలును వసురాజు సన్నెకల్లుకు తాకించినపుడు కాలియందెలు ఘల్లుమని మ్రోగినవని రామరాజ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:8(1), August: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

భూషణుడు వర్ణించాడు. ఇంకా నీలా సుందరీ పరిణయము, రసిక జన మనోభిరామము, రాజ శేఖర విలాసము, వేంకటాచల మాహాత్మ్యం మున్నగు ప్రాచీన కావ్యాలలో సన్నికల్లు ప్రస్తావన ఉన్నది. స్థలాభావంచేత వివరంగా వ్రాయుట లేదు. జానపదుల్లో వివిధ ఆచార పద్ధతుల్లో ఇంట్లోకి అవసరమయ్యే వస్తువులు చాలామటుకు సాంస్కృతిక వస్తువులుగా ఉపయోగపడతాయని తెలుస్తుంది. కొన్నిప్రాంతాలలో వ్యవసాయికంగా వాడే 'కాడి' పై కాలుద్రొక్కే ఆచారం కనిపిస్తుంది.

తెలంగాణాలో 'కాడి' రాయలసీమలో దీనినే కాని/కాణి మీద వధూవరులు కాలు ద్రొక్కే ఆచారం ఉంది. వివాహ వేదికపై బియ్యంతో గాని వడ్లతోగాని పోలువ్రాసి మధ్యలో ఈ 'కాడి'ని ఉంచి అటుప్రక్క ఇటుప్రక్క వధూవరులు కూర్చుంటారు. మధ్యలో తెరకడతారు. జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ అయినంక ఈ కాలుద్రొక్కేది జరుగుతుంది. దీనిని బట్టి వ్యవసాయోత్పత్తిలో ఉపయోగపడే కాడి, ఇంట్లో నిత్యం ఉపయోగపడే తోలు, తిరగలి, చేట, అయిరేణికుండలుగా అలంకరించబడిన కుండలు, సన్నికల్లు మొదలైన వస్తువులను క్రొత్తగా జీవితం ప్రారంభించబోయే జంటను ఒకటి చేసే వివాహంలో సాంస్కృతిక వస్తువులుగా పూజించి ఉపయోగిస్తారని అర్థమవుతుంది. ఈ వివాహంలో ఇంత సుదీర్ఘమైన తంతు సంబరం ఉంటుంది కనుక ఇది అంత ప్రాధాన్యం సంతరించుకొని నేడు ప్రపంచ దేశాల మన్ననలు పొందుతుంది మన భారతీయ వివాహ సంప్రదాయం.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. అమరసింహుడు. **అమరకోశము** (గురుబాల ప్రబోధిక సహితం), 1996. ప్రాచీన వావిళ్ళ ప్రతికి పునర్ముద్రణ, హైదరాబాదు.
2. ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం
3. పెద్దన అల్లసాని, ***మనుచరిత్ర***
4. సుందరం, ఆర్వీయస్. ***ఆంధ్రుల జానపద విజ్ఞానం,*** 1992. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
5. వస్తుగుణదీపిక
6. సీతారామాచార్యులు, బహుజనపల్లి. ***శబ్దరత్నాకరం,*** 1885, విక్టరీ బుక్స్ ప్రచురణలు, విజయవాడ.
7. సమాజశాస్త్రం
8. శ్రీనాథుడు. ***కాశీఖండం***
9. శ్రీనాథుడు. ***శృంగారనైషధం***